క్లుప్తంగా

కౌలురైతు గుర్తింపు కార్డులకు 114 దరఖాస్తులు



నాదెండ్ల: మండలంలోని కనపర్రు, ఇర్లపాడు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద బుధవారం కౌలు రైతుల గుర్తింపు కార్డులపై అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్‌లు పెరుమాళ్ళపల్లి వెంకటేశ్వర్లు, మంగు రమాదేవి, వీఆర్వోలు ఎం.నాగరాజు, వీహెచ్‌ఏలు రామాంజమ్మ, నాగరత్న కుమార్, పంచాయతీ కార్యదర్శులు జీఎల్ కాంతారావు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. రెండు గ్రామ సభల్లో 114 మంది రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇప్పటి వరకూ 81 మందికి గుర్తింపు కార్డులు అందించినట్లు వ్యవసాయాధికారి హరిప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ, కౌలురైతు గుర్తింపు కార్డుల వల్ల బహుళ ప్రయోజనాలు లభిస్తాయని, అర్హులైన కౌలు రైతులందరూ దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఆధార్ కార్డు, బ్యాంకు, పొలం పాసు పుస్తకాల జిరాక్సు కాపీలను సంబంధిత వీఆర్వోకు గానీ లేదా ఆర్‌బీకేలో గానీ అందించాలని కోరారు.

నాదెండ్ల గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి

నాదెండ్ల: చిలకలూరిపేట ఆర్టీసీ డిపో నుంచి నాదెండ్ల మీదుగా తూబాడు, చందవరం, సాతులూరు వరకూ ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. నాదెండ్ల నుంచి సాతులూరు, చందవరం గ్రామాలను కలుపుతూ గతంలో ఆర్టీసీ బస్సు ఉండేదని, కొంతకాలంగా ఆ బస్సు సౌకర్యం లేకపోవటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గ్రామస్తులు చిలకలూరిపేట వెళ్లాలన్నా, నరసరావుపేట వెళ్ళాలన్నా బస్సు సౌకర్యం లేక ఆటోలు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారన్నారు. చిలకలూరిపేట, నరసరావుపేట డిపోల అధికారులు స్పందించి ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు మహిళలకు ఉచిత అవకాశం కల్పిస్తామని హామీయిచ్చినందున బస్సు సౌకర్యం కల్పించి మండల ప్రజలకు కష్టాల నుంచి గట్టెక్కించి మేలు చేయాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో నియోజకవర్గ అధ్యక్షుడు మటన్ సుభాని, నాదెండ్ల మండల అధ్యక్షుడు షేక్ దాదాసాహెబ్, మస్తాన్‌వలి ఉన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



నకరికల్లు: మండలంలోని దేచవరం గ్రామంలో వేంచేసి ఉన్న మహాలక్ష్మీ గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ మూడవ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో సుందరంగా ఆలయం నిర్మించి మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షిక వేడుకలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు గిరీశం ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామి వారికి విశేష ద్రవ్యములతో అభిషేకాలు చేశారు. స్వామి వార్ల ఉత్సవ మూర్తులను, స్వామి వారిని విశేషంగా అలంకరించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి కుటుంబ సమేతంగా విశేష పూజల్లో పాల్గొన్నారు.

కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు తీసుకోవాలి

నకరికల్లు: కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు తీసుకోవడం ద్వారా బహుళ ప్రయోజనాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని దేచవరం, రూపెనగుంట్ల గ్రామాల్లో బుధవారం కౌలు రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట ఉత్పత్తులు విక్రయించేందుకు, పంటల బీమా పొందేందుకు సీసీఆర్‌సీ కార్డులు ఉపయోగపడతాయని అన్నారు.

ముగిసిన నవదశ వార్షిక బ్రహ్మోత్సవాలు

నగరంపాలెం: స్థానిక కృష్ణనగర్ ఒకటో వీధిలోని గోదా పద్మావతీ సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న నవదశ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఉదయం నిత్యపూజలు సుదర్శన, మూలమంత్ర హోమం, మహా పూర్ణాహుతి, వసంతోత్సవం, చక్రస్నానం, తిరుప్పావడసేవ, అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన జరగ్గా, భక్తులు పెద్ద ఎత్తున్న తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

- ఒకరిని చూసి మరొకరు బానిసలు కావొద్దు
- విద్యార్థులకు ఎస్‌ఈబీ ఎస్‌ఐ వినీల సూచన
- గణపవరం సీఆర్ కళాశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ



విద్యార్థులతో కలసి ర్యాలీలో పాల్గొన్న ఎస్‌ఐ వినీల, సిబ్బంది

నాదెండ్ల: జీవితాలను చిన్నాభిన్నం చేసే మాదక ద్రవ్యాల వినియోగానికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఎస్‌ఈబీ ఇన్‌చార్జి ఎస్‌ఐ సీహెచ్ వినీల విద్యార్థులకు సూచించారు. గణపవరం చుండి రంగ నాయకులు కళాశాలలో బుధవారం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గంజాయి, డ్రగ్స్, ఇన్‌హేల్ సొల్యూషన్లు వంటి మాదకద్రవ్యాల సేవనంతో ఆరోగ్యం దారుణంగా పాడవుతుందన్నారు. ఒకరిని చూసి మరొకరు మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారుతుండటం ఆందోళనకరమన్నారు. మాదకద్రవ్యాల విక్రయం, రవాణా, సేవనం చట్టరీత్యా నేరమన్నారు. వీటి విక్రేతలు, సేవనం చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తద్వారా జీవితంలో చక్కగా ఎదగాలని కోరారు.

కార్యక్రమంలో నాదెండ్ల ఎస్సై జె.బలరామ్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ చైతన్య, ఎస్‌ఈబీ సిబ్బంది రవిబాబు, ఎస్.నాగేశ్వరరావు, ఎం.దిలీప్‌రెడ్డి, నాగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నరసరావుపేట రూరల్: మాదక ద్రవ్యాల వినియోగానికి విద్యార్థులు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) సూపరింటెండెంట్ కె.ఖాజామోహిద్దీన్ తెలిపారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని



నరసరావుపేటలో మాట్లాడుతున్న సెబ్ సూపరింటెండెంట్ ఖాజామోహిద్దీన్

నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో సెబ్ సూపరింటెండెంట్ ఖాజామోహిద్దీన్, సీఐ నయనతార, కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖాజామోహిద్దీన్ మాట్లాడుతూ ప్రపంచంలోని 144దేశాల్లో మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మన దేశంలో ప్రతి లక్ష మందిలో 250 మంది డ్రగ్స్‌ను వినియోగిస్తున్నారని తెలిపారు. డ్రగ్స్ వినియోగం మెట్రోపాలిటిన్ నగరాల నుంచి అన్ని పట్టణాలకు విస్తరిస్తుందన్నారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండి డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండి కెరీర్‌పై దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపలి రమేష్ బాబు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి ఐ.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రెండు నూతన ఆర్టీసీ బస్సులు ప్రారంభం

రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



బస్టాండ్‌లో నూతన బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, అధికారులు, నాయకులు

నరసరావుపేట: ఆర్టీసీ డిపోకు కేటాయించిన రెండు బస్సులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు బుధవారం రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభించారు. బస్సుల్లోకి ఎక్కి వాటిని పరిశీలించారు. ప్రారంభించిన రెండింటిలో ఒకటి సూపర్ లగ్జరీ కాగా మరొకటి అల్ట్రా డీలక్స్ బస్సు. జిల్లా కేంద్రమైన నరసరావుపేట నుంచి హైదరాబాదుకు రెండు ఏసీ బస్సులు, చెన్నైకు మరో రెండు బస్సులు కావాలని అధికారులు ఎమ్మెల్యేకు విన్నవించారు. సంస్థ ఎండీతో మాట్లాడి ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. బస్టాండ్ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని వారికి సూచించారు. కాగా, గత ప్రభుత్వం బుక్‌చేసిన 1500 బస్సుల్లో తయారై వచ్చిన వాటిలో రెండింటినీ డిపోకు కేటాయించారు. కార్యక్రమంలో డెప్యూటీ ఆర్‌ఎం నర్రా శ్రీనివాసరావు, డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి, నాయకులు కపలవాయి విజయకుమార్, దేశిరెడ్డి చిన్నపరెడ్డి, పూదోట రాయన్న, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పాలన మారింది.. పద్ధతి మార్చుకోవాలి

నరసరావుపేట: ప్రభుత్వం మారి 22 రోజులైనా ఇంకా అధికారుల వైఖరి మారకపోతే ఎలాగని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అధికారులను ప్రశ్నించారు. బుధవారం పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫొటోలు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తున్నా, ఇంకా ఏర్పాటు చేయకపోవడాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం మారి ఇన్ని రోజులైనా ఎందుకు ఇంకా ఏర్పాటు చేయలేదని సిబ్బందిని ప్రశ్నించారు. విద్యుత్‌శాఖ డీఈకి ఫోన్‌చేసి ప్రశ్నించారు. ప్రభుత్వం మారింది, అధికారుల పద్ధతులు కూడా మారాలని, ప్రజల కోసం ప్రజాస్వామ్య బద్ధంగా పని చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించం

ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండాల్సిన వార్డు సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోవద్దని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అధికారులకు సూచించారు. బుధవారం పట్టణంలోని బరంపేట వార్డు సచాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో సిబ్బంది లేకపోవడంపై మండిపడ్డారు. రికార్డుల్ని పరిశీలించి ప్రతిరోజూ సిబ్బంది గైర్హాజరు కావటాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థ ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలాగని ప్రశ్నించారు.

పాస్‌బుక్, ఆధార్ కార్డు ఇచ్చినా నష్టం లేదు

కౌలు కార్డుల విషయమై వ్యవసాయాధికారి సూచన

రొంపిచర్ల: కౌలు కార్డుల కోసం పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ ఇవ్వటం వలన భూ యజమానులకు ఎటువంటి నష్టం కలుగదని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ.మస్తానమ్మ అన్నారు. మండలంలోని విప్పర్ల, కొత్తపల్లి గ్రామాల్లోని సచివాలయాలలో కౌలురైతులకు కార్డుల జారీపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఆమెతో పాటు జిల్లా వ్యవసాయ శిక్షణ కేంద్రం, వ్యవసాయ ఉపసంచాలకులు శివకుమారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కౌలు రైతు కార్డు తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఎటువంటి అపోహలు చెందకుండా సాగుదారులకు కౌలు కార్డు ఇవ్వడానికి ముందుకు రావాలని భూమి యజమానులకు తెలిపారు.



మాట్లాడుతున్న సహాయ సంచాలకులు మస్తానమ్మ

పొలం కౌలుకు సాగుచేసే రైతులు అందరూ కూడా తప్పక కౌలు కార్డులు పొందాలని, తద్వారా ప్రభుత్వం అందించే పంట రుణాలు, పంటన మోదు, పంటనష్ట పరిహారం, సబ్సిడీ మీద అందించే విత్తనాలు, ఎరువులు పొందేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. వీఏఏలు ఎస్.రాజశేఖర రెడ్డి, వెంకటేష్, వి.ఆర్.ఓ సురేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

28న దేవదాయ భూముల వేలం

ఈపూరు : మండల కేంద్రంలోని శ్రీ వీరేశ్వర స్వామి వారి దేవస్థానానికి సంబంధించిన భూములను దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ ఉదయం 10గంటలకు ఆలయంలో బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు అధికారులు బుధవారం తెలిపారు. 2024–25 నుంచి 2026–27 వరకు 3 సంవత్సరాల పాటు కౌలు పొందేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాటలో పాల్గొనే వారు ముందుగా డిపాజిట్లు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాల కోసం కార్యనిర్వహణ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సింగర చెరువు పరిశీలన

వినుకొండ(నూజెండ్ల): పట్టణ ప్రజలకు తాగు నీరు అందించే సింగరచెరువును, శుద్ధి చేసే ఫిల్టర్ బెడ్స్‌ను ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బుధవారం పరిశీలించారు. చెరువులో నీరు తక్కువగా ఉన్నందున జాగ్రత్తగా వినియోగించాలని అధికారులకు సూచించారు. నీటితో సింగరచెరువును నింపేందుకు చరవాణిలో మంత్రితో మాట్లాడారు. అనంతరం జీవీ మాట్లాడుతూ శాశ్వత మంచినీటి పథకం పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు, మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, డీఈ వెంకయ్య, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పలువురు రేషన్ షాపు డీలర్ల రాజీనామా

యడ్లపాడు: మండలంలోని పలు గ్రామాలకు చెందిన రేషన్ దుకాణాల నిర్వాహకులు రాజీనామా చేసినట్లు రెవెన్యూ అధికారులు బుధవారం తెలిపారు. ఆయా దుకాణాలకు నూతన నిర్వాహకులను నియమించే వరకు సరుకుల పంపిణీ ప్రక్రియను గ్రామ రెవెన్యూ అధికారి, సచివాలయ సిబ్బంది ద్వారా చేయనున్నట్లు తెలిపారు.

పిల్లల్ని బడికి పంపండి

- ప్రభుత్వ పాఠశాలల్లో అర్హులైన ఉపాధ్యాయులున్నారు
- మెరుగైన సౌకర్యాలున్నాయి!
- తల్లిదండ్రులకు ఉపాధ్యాయుల వినతి
- వేర్వేరు ప్రాంతాల్లో నేను బడికిపోతా కార్యక్రమం



కంభంపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వినుకొండ(నూజెండ్ల): నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా నూజెండ్ల మండలం కంభంపాడులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వి.నరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించినటువంటి ఈ అవకాశాన్ని ఉపయోగించి బడిబయట పిల్లలందరూ బడిలో చేరాలని, ప్రభుత్వం అందించే వివిధ ప్రోత్సాహకాలు, ఉచిత పుస్తకాలు, సమదుస్తులు, డిజిటల్ విద్యాబోధన వంటి కార్యక్రమాలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్. అంజిరెడ్డి, టి.శ్రీనివాసరావు, ఎల్. రామాంజిరెడ్డి, ఏఎస్‌ఎస్ సూర్యప్రకాష్‌రావు, ఎ.బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎండుగుంపాలెంలో ..

నాదెండ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య, ఉచిత భోజనం, పాఠ్యపుస్తకాలు అందిస్తున్నట్లు జెడ్పీ హైస్కూలు హెచ్ఎం కె రామలక్ష్మణ రావు చెప్పారు. మండలంలోని ఎండుగుంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కలిసి నేను బడికిపోతా కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో డ్రాపవుట్ విద్యార్థులను గుర్తించి నేరుగా వారి గృహాలను



ఎండుగుంపాలెంలో చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

సందర్శించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాలల్లో చేర్పేలా ఏర్పాటు చేశారు. పలువురు విద్యార్థులకు అడ్మిషన్లు అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హులైన ఉపాధ్యాయులు, మెరుగైన వసతులు ఉన్నందున విద్యార్థులకు నాణ్యమైన విద్య లభించి జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో చేర్చి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సాంబశివరావు, పీడీ కె.శ్రీనివాసరావు, నల్ల మోతు రత్నబాబు, సీఆర్‌పీ షేక్ బాజీ, అమీర్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు సద్వినియోగం చేసుకోవాలి



నకరికల్లు: ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఫాహిం విద్యార్థులకు సూచించారు. మండలంలోని చేజర్ల గ్రామంలోని ఉన్నత పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గ్రామంలోని పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశామని అన్నారు. బడి బయట పిల్లలను బడిలో చేర్పించడం, వయస్సుకు తగిన తరగతుల్లో చేర్పించడం లాంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ర్యాలీలో విద్యార్థులు నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పఠాన్ మల్లిక, చెరుకూరు వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్‌వలి, గేరా మో హన్ రావు, ఏసీహెచ్ వెంకట్రావు, బత్తుల సుందర రావు, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి ఉన్నతంగా ఎదగండి

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు
- గణపవరంలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్ల పంపిణీ



గణపవరం హైస్కూలులో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

నాదెండ్ల: తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తు చేసుకుంటూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ద్వారా అందించిన స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. సుమారు 900 మందికిపైగా విద్యార్థినీ విద్యార్థులకు అందించారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాఠశాల ఆవరణలోని చదువుల తల్లి సరస్వతీ దేవి ఆలయంలో పూజలు నిర్వహించారు. స్థానిక పాఠశాల హెచ్ఎం ఐ.కృష్ణానాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పుల్లారావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగంలో మౌలిక వసతులకు పెద్దపీట వేసి వాటిని గణనీయంగా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రానికి, దేశానికి విద్యార్థులే భవిష్యత్‌కు పునాదులు వేయాలన్నారు. విద్యార్థులకు ఉన్నతమైన భవిష్యత్ ఏర్పడినపుడే దేశవిదేశాల్లో ఉన్నత స్థానాల్లో రాణించి తెలుగువారి సత్తాను చాటుతారన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం కృష్ణానాయక్ పాఠశాల సమస్యలపై ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు దృష్టికి తీసుకొచ్చారు. విద్యా డివిజన్‌లోనే మన పాఠశాల పెద్దదని, ఇందులో సుమారు వెయ్యి మందికి పైగా విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారన్నారు. స్థానిక పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల పిల్లలు ఎక్కువగా చదువుతున్నారని, గడిచిన మూడేళ్లలో మండలస్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంటున్నామన్నారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవటంతో ప్రతి ఏడాది పదో తరగతి పరీక్ష కేంద్రానికి అనుమతి రాకుండా పోతోందన్నారు. ప్రహరీ నిర్మాణానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో ఈమని కృష్ణారెడ్డి, పల్నాడు జిల్లా డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, పీఎంసీ చైర్మన్ సూరా శంకరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మారుతి, కౌన్సిలర్ గంగా శ్రీనివాసరావు, నాయకులు కెల్లంపల్లి అచ్చయ్య, పెంట్యాల శేషయ్య, మాలెంపాటి లక్ష్మీనారాయణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జీవీ

విద్యార్థి వస్తువుల పంపిణీ

బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు జడ్పీ హైస్కూల్లో బుధవారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ (విద్యార్థి వస్తువులు) ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆర్వో వాటర్ ప్లాంట్‌కు అవసరమైన నీటి సరఫరా, 3 పీడీ పోస్టులు ఖాళీ, వంటి సమస్యలను హెచ్ఎం ఎస్‌కె అలీషా, ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అనంతరం జీవీ మాట్లాడుతూ జిల్లాలోనే ఫలితాల్లో అగ్రస్థానం నిలవాలనీ, విద్యాప్రమాణాలు పెంచి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 సయ్యద్ జఫ్రుల్లా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు జయప్రదం చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

చిలకలూరిపేట: రాష్ట్రస్థాయి విద్యావైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల నాసర్‌జీ కోరారు. ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో జులై 8 నుంచి 10వ తేదీ వరకు కాకినాడలో నిర్వహించే విద, వైజ్ఞానిక శిక్షణ తరగతుల కరపత్రాలను పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం విద్యార్థి నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు రాజకీయ పరిజ్ఞానం, ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. సమాజంలో ఉన్న అవినీతిని వెలికి తీయడానికి, అక్రమాలపై పోరాటాలు చేయడానికి ఈ శిక్షణా తరగతులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. దేశంలో విద్యారంగంలో వస్తున్న మార్పులపై సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై విద్యార్థుల్లో చైతన్యం నింపడానికే శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కాకినాడలో జరుగుతున్న శిక్షణా తరగతుల్లో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ ఏరియా కార్యదర్శి మేకపోతుల నాగేశ్వరరావు, నాయకులు అన్నం శ్రీనివాస్, పాతపట్నం గోపి, మేకపోతుల మధు పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డులపై అవగాహన

ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరు రైతు భరోసా కేంద్రంలో కౌలు రైతు కార్డులపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఆర్. రామారావు మాట్లాడుతూ కౌలుకు సాగు చేస్తున్న కౌలు రైతులందరూ కూడా కౌలు రైతు కార్డులను కలిగి ఉండాలని, వాటి ద్వారా సబ్సిడీపై ఇచ్చే విత్తనాలు, ఎరువులు పొందవచ్చని, ఈ క్రాప్ బుకింగ్ చేయడానికి, పంట రుణాలు పొందడానికి, మద్దతు ధరపై పంట కొనుగోలు, ఇలా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని వివరించారు. కౌలు రైతు కార్డులు రైతుకి ఇవ్వడం ద్వారా భూ యజమానికి ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. ఈ కార్డుల కాలపరిమితి 11 నెలలు మాత్రమే ఉంటుందన్నారు. కౌలు రైతు కార్డుల కోసం మీ గ్రామంలోని ఆర్‌బీకేలోని వీఏఏలు, వీఆర్వోలను కలిసి భూయజమాని ఆధార్ జిరాక్స్ లేదా పొలం పాస్‌బుక్ జిరాక్స్, కౌలు సాగు చేసే రైతు యొక్క ఆధార్ జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, ఫోటోలను అందజేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రసీదులు తీసుకోవాలన్నారు. ఆర్‌బీకేల్లో 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. భూసార పరీక్షల కోసం ఆర్‌బీకేల్లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ ఎం.శేషుబాబు, వీఆర్వో బి.అశోక్, రైతులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో కౌలు రైతుల గ్రామ సభలు

సత్తెనపల్లి: కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు (కౌలు రైతు కార్డు) అందించేందుకు సత్తెనపల్లి మండలం కంటిపూడి, కొమెరపూడి, లక్కరాజుగార్లపాడు గ్రామాల్లో బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ రెవెన్యూ అధికారులు షేక్ ఘన్‌సైదా, జి.కిరణ్‌కుమార్, షేక్ జాన్‌రస్కిన్, వీహెచ్‌ఏలు ఎస్.మనోజ్ కుమార్, ఒ.శివశంకర్, ఎం.చంద్రశేఖర్‌లు హాజరై కౌలు రైతులకు అవగాహన కల్పించారు. అర్హత కలిగిన కౌలు రైతులు దరఖాస్తులు అందించాలని కోరారు. ఆయా సభల్లో కౌలు రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర జనరల్ సెక్రటరీగా రాము



సత్తెనపల్లి: ఏపీ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర జనరల్ సెక్రటరీగా పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని 19వ వార్డుకు చెందిన గొల్లపల్లి రాము నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావు నుంచి బుధవారం ఆయన ఉత్తర్వులు అందుకున్నారు. గొల్లపల్లి రాము ఈ నెల 23 నుంచి 2026 డిసెంబర్ 31 వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా గొల్లపల్లి రాము మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి, తనపై ఎంతో నమ్మకంతో రాష్ట్ర జనరల్ సెక్రటరీగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన కౌలు రైతుల గ్రామ సభలు



తొండపిలో మాట్లాడుతున్న తహసీల్దార్ సింగారావు, పక్కన ఏవో అరుణ

రుద్రవరం(ముప్పాళ్ళ): మండలంలోని రుద్రవరం, తొండపి గ్రామాల్లో కౌలు రైతుల గుర్తింపు కార్డుల ఎంపికపై బుధవారం గ్రామ సభలు జరిగాయి. ఆయా గ్రామ సభల్లో తహసీల్దార్ పి.సింగారావు, మండల వ్యవసాయాధికారి ఎం.అరుణలు పాల్గొని కౌలు రైతులకు గుర్తింపు కార్డులపై అవగాహన కల్పించారు. పొలం కౌలుకు సాగు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా గుర్తింపు కార్డు తీసుకోవాలన్నారు. ఈ కార్డు వలన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రైతు భరోసా సాయం అందుతుందన్నారు. కౌలు రైతు కార్డు ద్వారా ఐదుగురు కలిసి గ్రూపుగా ఏర్పడి బ్యాంకు ద్వారా రుణం పొందవచ్చన్నారు. అలాగే ప్రభుత్వం సబ్సిడీపై అందించే విత్తనాలు, ఎరువులు పొందవచ్చన్నారు. సర్పంచ్ రావ్రోలు వెంకటకృష్ణారెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పీలా ఆంజనేయులు, వీఆర్వో మస్తాన్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.